ప్రజాశక్తి

బుధవారం 30 నవంబర్ 2022

5

అల్లూరి సీతారామరాజు

రాప్తాడు ఎమ్మెల్యేపై ఎస్‌పికి ఫిర్యాదు

ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: టిడిపి అధినేత చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లను చంపేస్తానంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డిపై హత్యా యత్నం కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టిడిపి నేతలతో కలిసి వెళ్లి, ఎస్‌పి సతీష్ కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. జడ్‌పి మాజీ చైర్మన్ వంజరి కాంతమ్మ, టిడిపి నాయకులు కోడా వెంకట సురేష్‌కుమార్, గబ్బడ సింహాచలం, రంజిత్ కుమార్, శివకుమార్, వెంకటరమణ, దప్పోడి వెంకటరమణ, బుక్క జగదీష్, కిల్లో శ్రీను, బుద్ద జ్యోతి కిరణ్, సుబ్బలక్ష్మి, పారిజాతం, శివశంకర్ సుమన్, కోటిబాబు, మర్ల మణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం

కాంట్రాక్టర్‌కు ఐదుకు మించి పనులు అప్పగించొద్దు

సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జలజీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి గిరిజనులకు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో పాడేరు డివిజన్ జలజీవన్ మిషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 56 కింద మంజూరైన 8789 పనులలో 1550 పనులు పూర్తి కాగా మిగిలిన పనుల ప్రగతిపై కలెక్టర్ ఆరా తీశారు. మండలాల వారీగా నిర్వహించిన సమీక్షలో పాడేరు సహాయ ఇంజనీర్ సరైన వివరాలతో హాజరు కాకపోవటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. 15 రోజులకు ఒకసారి నిర్వహించే సమావేశానికి కూడా పూర్తి వివరాలు తీసుకు రాకపోతే ఎలాగని ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి సమావేశానికి పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. పనుల నాణ్యత సరిగా లేకుంటే కాంట్రాక్టర్ నుండి రికవరి చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 818, 235 పనులు ప్రగతిలో ఉండగా మరో 1079 పనులకు టెండర్లు పిలవగా 800 వరకు టెండర్లు ఖరారయ్యాయన్నారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు ఐదు పనులకు మించి అప్పగించవద్దని కలెక్టర్ ఆదేశించారు. అప్పగించిన పనులు పూర్తి చేసిన మాత్రమే కొత్త పనులు అప్పగించాలన్నారు. ఎక్కువ పనులను అప్పగించడం వల్ల పనుల పురోగతి, వేగవంతం, నాణ్యతపై కాంట్రాక్టర్లు శ్రద్ధ పెట్టక జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 8789 కింద జిఓలు మంజూరైన పనులకు మండలాల వారీగా నివేదికలు తయారు చేసి సమర్పించాలన్నారు. రూ. ఐదు లక్షలకు మించి విలువైన పనులకు సంబంధిత సాంకేతిక సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఇక ఖరారు చేయాలని, ప్రతి విషయం డిఇఇ, ఇఇల దృష్టిలో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జలజీవన్ కలెక్టర్ జామిగూడ పర్యటనలో 14 గ్రామాలకు సంబంధించి రూ.56 లక్షలతో చేపట్టిన మంచి నీటి పథకం పనులను ముగ్గురు కాంట్రాక్టర్లకు అప్పగించాలని చెప్పిన విషయం గుర్తు చేస్తూ, వాటి ప్రగతి పై ఆరా తీసారు. సమావేశంలో జలజీవన్ మిషన్ ఇఇ లీలాక్రిష్ణ, డిఇఇలు గోపాలకృష్ణ, జయరాం, ఆర్. రాజు, ప్రకాష్, మండల సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో లెక్చరర్లను నియమించాలి

ప్రభుత్వానికి ఎస్‌ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలను ఎస్ఎఫ్ఐ సభ్యుల బృందం సందర్శించి, విద్యార్థినులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె. ప్రభుదాస్ మాట్లాడుతూ గురుకులాల్లో పూర్తిస్థాయి లెక్చరర్స్‌ను నియమించాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరునెలలు కావస్తున్నా, పూర్తిస్థాయి అధ్యాపకులు నియమించకపోవడం వల్ల విద్యాబోధన కుంటుబడి, దాని ప్రభావం గిరిజన విద్యార్థులపై ఉంటుందన్నారు. బాలికల గురుకుల పాఠశాలలో ఎంపిసి మ్యాథ్స్,హెచ్ఇసి గ్రూప్‌కు హిస్టరీ, ఎకనామిక్స్ ఒకేషనల్, గ్రూపులకు సంబంధించి అధ్యాపక సిబ్బంది పూర్తిస్థాయిలో లేరని, నేటికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. తలారి సింగి బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి గురుకుల కళాశాల వైపునకు వస్తున్న కాలువతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని గిరిజన విద్యాలయాల్లో ఇన్ని సమస్యలుంటే మారుమూల ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తప్పదనిహెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె. ప్రభుదాస్,ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. జీవన్, జిల్లా నాయకులు పి. వరహాలు, కార్తీక్, ప్రసాద్, మండల నాయకులు పాల్గొన్నారు

నియంతలా బొత్స వ్యాఖ్యలు

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉద్యోగ సంఘాల నేతలకు అవసరమైతే కాళ్లుపట్టుకునే నేర్పు ఉండాలని, ధర్నాలు, రాస్తారోకోలు చేయడం తగదని ఉద్యోగ సంఘాల నాయకులను ఉద్దేశించి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు నియంతత్వ పాలనకు నిదర్శనమని, తన వ్యాఖ్యలను బొత్స వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముఖి శేషాద్రి, బోయపల్లి సింహాచలం మంగళవారం విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులపై మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే బొత్స క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని సమస్యలను సష్టిస్తూ, ఎప్పటినుంచో ఉద్యోగులకు ఉన్న ప్రయోజనాలను దూరం చేయడమే కాక, సమస్యలను సృష్టించడమే తప్ప ఒక్కదానినైనా పరిష్కరించని వైసిపి ప్రభుత్వంలోని విద్యామంత్రి బొత్స ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురహంకారామేనని మండిపడ్డారు. ఉద్యమాలు చేసి ప్రభుత్వాలు, యాజమాన్యాల మెడలను వంచి హక్కులను సాధించుకోవడం, సమస్యలను పరిష్కరించుకోవడం తప్ప, కాళ్ల పట్టుకోవడం ఉద్యోగులకు అవసరం లేదన్న విషయాన్ని బొత్స గమనంలో పెట్టుకోవాలన్నారు. ఉద్యోగుల సహకారం లేనిదే ప్రభుత్వాల మనుగడ సాధ్యం కాదన్న పూర్వపరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, బొత్స వ్యహరించడం మంచిదని హితవు పలికారు.

హారిక మృతికి ప్రభుత్వమే కారణం

విద్యార్థులతో మాట్లాడుతున్న జిఎస్‌యు నేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా కేంద్రం పాడేరులోని గురుకుల బాలికల కళాశాలను మంగళవారం జిఎస్‌యు నాయకులు సందర్శించారు. అనారోగ్యంతో ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఒకేషనల్ కోర్స్ విద్యార్థిని కంకిపాటి హారిక మరణంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో సరైన వైద్యం అందకపోవడమే హారిక మరణానికి కారణమని తెలుస్తోందని, ఇటువంటి బాధాకర ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టచర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. హారిక మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి ఆమె కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిఎస్‌యు నాయకులు సుమన్, మాధవరావు, నాని, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

సదస్సుకు హాజరైన వివిధ రాష్ట్రాల మిరియాల కొనుగోలుదారులు

ప్రజాశక్తి- అరకులోయ : సుగంధ ద్రవ్యాల సాగుకు మన్యం నిలయమని జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. మంగళవారం అరకులోయలోని రజనిజెల్ల వైష్ణవి రిసార్ట్‌లో స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మిరియాల ఉత్పత్తుల కొనుగోలుదారులు, విక్రయదారుల రెండు రోజుల సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సుగంధ ద్రవ్యాల ప్రోత్సహిస్తే అల్లూరి జిల్లా కేరళను మించిపోతుందన్నారు. అడవులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు ప్రతికూల పరిస్థితుల్లోనూ మిరియాలు, పసుపు, తేనె, కరక్కాయ వంటి అటవీ ఉత్పత్తులు సాగు, సేకరణ చేస్తున్నారని, అయితే గిట్టుబాటు ధర దక్కక వీరి శ్రమ దళారుల పాలుకావడం దురదృష్టకరమన్నారు. అటవీ ఉత్పత్తులతోనే గిరిజనం జీవనం, మనుగడ ముడిపడి ఉందని, కాఫీ, మిరియాలు, పసుపు వంటి అటవీ ఉత్పత్తులను వాణిజ్య సంస్థలు నేరుగా గిరిజనుల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు.ప్రతి ఆరు నెలలకు ఒకసారి విక్రయదారుల సదస్సులు నిర్వహించడం వల్ల దళారి వ్యవస్థ తగ్గుముఖం పడుతుందన్నారు.అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, కాఫీ కంటే మిరియాలకు అధిక ధర లభిస్తుం దన్నారు. రైతులు వారపుసంతలో కాఫీ, మిరియాలు విక్రయించవద్ద న్నారు. గిరిజన రైతులకు మార్కెటింగ్ సదుపాయాల కల్పనలో తగినవిధంగా సహాయ సహకారాలు అందించాలని కొనుగోలుదారులకు సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏజెన్సీలో మండలానికి రెండు గ్రామాలను ఎంపిక చేసి, మిరియాలు క్రయవిక్రయాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, రైతులకు ఆర్థికసాయం అందించి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. మిరియాల సేకరణకు నిచ్చెనలు సరఫరా చేయాలని అన్నారు. ట్రైకర్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ, జిల్లా పరిధిలో స్పైసెస్ బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దళారుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం క్రయ,విక్రయదారులు, గిరిజన రైతులతో జిల్లాకలెక్టర్ ముఖాముఖి అయ్యారు. కార్యక్రమంలో సుగంధ ద్రవ్యాల బోర్డు డిప్యూటీ డైరెక్టర్ జోజి మాథ్యూ, నితిన్ జోయ్, ఎన్‌సిడిసి రీజనల్ డైరెక్టర్ వీకే దుబాస, సంచాలకులు వి. జీజేష్, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బొడ్డు కళ్యాణి, ఫుడ్ అండ్ ఆగ్రో మేనేజర్ వినయ్‌సింగ్, పద్మాపురం సర్పంచ్ సుస్మిత, అరకు ఎంపిపి ఉషారాణి, ఎంపిటిసి కిల్లో సుధాకర్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు కొనుగోలు, విక్రయదారులు, రైతులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ భవాని

ప్రజాశక్తి- అనంతగిరి : పండ్ల తోటల పెంపకంతో రైతులు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని రాష్ట్ర సిఆర్‌డి ప్లాంటేషన్ సెక్షన్ డిప్యూటీ కమిషనర్ సి.భవాని అన్నారు. వ్యవసాయ పంటలతో పాటు ఏడాదికి ఒకసారి రైతులకు ఆదాయాన్నిచ్చే పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. మంగళవారం మండలంలోని ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలను సందర్శించారు. ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు పంపిణీ చేసిన పండ్ల మొక్కల స్థితిగతులను పరిశీలించారు. ఉపాధిహామీ వేతనాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ గిరిజన రైతులను ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆదాయాన్ని అందించే పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధి పనిదినాలను 100 నుంచి 150రోజులకు పెంచాలని పలువురు గిరిజనులు విన్నవించగా, దీనిపై ప్రభుత్వానికి నివేదిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ టీం కొండ నాయక్, సుధీర్, ఉపాధి హామీ పథకం ఇన్‌ఛార్జి ఎపిడి పవన్, టెక్నికల్ అసిస్టెంట్ కొండబాబు పాల్గొన్నారు

కూలి రేటు పెంపుపై జిఓ విడుదలకు ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై, గిరిజన కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంపు విషయంలో జరిగిన చర్చలలో వచ్చిన హామీలను జిఓ రూపంలో విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. చింతూరు జీసీసీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కార్మికులు కూలిరేట్లు పెంచాలని ఆందోళన చేసిన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఎండీ యూనియన్ నాయకులతో విజయవాడలో చర్చలు చేసి కూలీ రేటు క్వింటకు రూ.22 నుండి రూ.25కు పెంచుతామని, యూనిఫామ్ కుట్టుకూలి ఒక జతకు రూ.600 నుండి రూ.700కు పెంచుతామని, పెంచిన రేట్లు 2022 జనవరి నుండి అమలు చేసి ఏరియర్స్ చెల్లిస్తామని, హమాలీలకు మంచి నీళ్లకు నెలకు రూ.300 ఇస్తామని, ఈఎస్ఐ అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. చర్చలు చేసి 6 నెలలు గడుస్తున్నా అధికారులు ఇచ్చిన హామీలను జిఓ రూపంలో ఇచ్చి అమలు చేయడం చేయలేదని పేర్కొన్నారు. హమాలీల చేత వెట్టి చాకిరీ చేయించుకుంటూ వారి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులలోకి నెట్టివేయడం దారుణమన్నారు. చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, అడ్డతీగల ఎంఎల్ఎస్ పాయింట్స్ నుండి వచ్చి చేసిన అదనపు పనికి పాడేరు డిఎం నుండి రావాల్సిన కూలీ డబ్బులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు ఇచ్చిన హామీని నిలపెట్టుకోలేక పోతే డిసెంబర్‌లో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీసీసీ గొడౌన్ ఇన్‌ఛార్జికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు స్వామి, రాజు, నాగార్జున, రాము, నాగు, చంద్రయ్య, చిట్టిబాబు, రమేష్, మంగరాజు, రామారావు, ముత్తయ్య, అప్పారావు, రాముడు, సీతయ్య పాల్గొన్నారు.

ధర్నా అనంతరం జిసిసి గొడౌన్ ఇన్‌ఛార్జికి వినతిపత్రం ఇస్తున్న వెంకట్, జిసిసి హమాలీలు

వైద్యాధికారి హిమబిందుకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి- సీలేరు

గూడెం కొత్తవీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డికె.హిమబిందుకు రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.నివాస్ ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ ప్రశంసా పత్రాన్ని మంగళవారం పోస్ట్ ద్వారా పంపించారు. ఈ నెల 10వ తేదీన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సి వైద్యాధికారి హిమబిందు గుమ్మిరేవుల గ్రామాన్ని సందర్శించి, ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. ఓ గృహంలో తీవ్ర అనారోగ్యంతో కుతుర తులసి బాధపడుతూ ఉండడానికి గుర్తించి ఆమెకు రక్త పరీక్షల నిర్వహించగా నాలుగు గ్రాములు హెచ్‌బి (హిమోగ్లోబిన్) ఉన్నట్టు గుర్తించారు. వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా బాధితురాలు నిరాకరించింది. దీంతో వైద్యాధికారి గ్రామ పెద్దలు సహకారంతో బలవంతంగా చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ హిమబిందును అభినందిస్తూ ఉత్తమ సేవా ప్రశంసా పత్రానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రశంసా పత్రం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఆదివాసీలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

రక్తహీనతతో బాధపడుతున్న మహిళను చింతపల్లి ఏరియా ఆసుత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హిమబిందు తదితరులు (ఫైల్ ఫొటో)

మందుపాతర పేలి సిఆర్‌పిఎఫ్ జవాన్‌కు గాయాలు

ప్రజాశక్తి-చింతూరు

చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందు పాత్ర పేలిన ఘటనలో కూంబింగ్ వెళ్లిన సీఆర్పీఎఫ్ జవాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. బీజాపూర్ ఎస్పి ఆంజనేయ వైష్ణం కథనం ప్రకారం... మంగళవారం ఉదయం మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గలగం అటవీ ప్రాంతంలో సిఆర్పిఎఫ్ 168 బట్టలియన్ కూంబింగ్ చేస్తుండగా, మావోయిస్టులు ముందుగానే అమర్చిన ఐఈడి మందు పాత్ర పేలింది. దీంతో దీపక్ పశ్వాన్ అనే సిఆర్పిఎఫ్ జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని బీజాపూర్ ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందంచారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

సకాలంలో నిత్యావసర సరుకులు అందజేయాలి

- సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి మారేడుమిల్లి

ఏజెన్సీలోని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జిసిసి మేనేజర్లు, రేషన్ షాపుల డీలర్లు, ఎండియు వాహనాల డ్రైవర్లు, సివిల్ సప్లై అధికారులతో సబ్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఆర్.శివ ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతి నెల ఒకటవ తారీఖు నుండి 22వ తారీఖు వరకు ఎండియు వాహనాల ద్వారా బియ్యం ప్రతి ఇంటికి సరఫరా చేయాలని, లేకుంటే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపులో మూడో వారం సరుకుల రికవరీ వెంటనే డీడీలు తీసి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం గణేష్ కుమార్, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, జిసిసి డిఎం పార్వతీశం, సీనియర్ మేనేజర్ ఎం.దాజారెడ్డి, తహశీల్దార్లు సుబ్రమణ్యం, వెంకటేశ్వరరావు, బి.రాజు. కె.సుధాకర్. వీరభద్రరావు, ఎంపీడీవోలు ఎంరిజర్ కుమార్ బాబు, ఎం.బాపన్నదొర, వీర కిషోర్, రత్నకుమారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపిటిసి సత్యవేణి, దేవుడు తదితరులు

బోర్లు మంజూరు చేయాలని ఎంపిపికి వినతి

ప్రజాశక్తి-కోయ్యూరు

తమ గ్రామాలకు బోర్టు మంజూరు చేయాలని మండలంలోని రావణాపల్లి ఎంపిటిసి ఇరువాడ సత్యవాణి, సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేవుడు మంగళవారం ఎంపిపి బడుగు రమేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. వైఎన్.పాకల, చిన్న నల్లగొండ, రావణాపల్లి పంచాయతీ రామన్న పాలెంలో బోర్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎంపిపి సానుకూలంగా స్పందించారు.

సమావేశంలో పాల్గొన్న డిపిఒ కొండలరావు, అధికారుల, పంచాయతీ కార్యదర్శులు

15వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుధ్య పనులు

- జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయితీలలో పారిశుధ్య నిర్మూలన, తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం వద్ద రాజవొమ్మంగి, అడ్డతీగ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు చిత్తశుద్ధితో పనిచేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని 430 పంచాయతీలకు 2021- 22 ఆర్థిక సంవత్సరానికి రూ.2.15 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘంలో టైడ్ నిమిత్తం రూ.13.98 కోట్లు నిధులు విడుదల చేయగా వాటితో పారిశుధ్యం, తాగునీరు వంటి వాటికి మాత్రమే ఉపయోగించాల్సి ఉందన్నారు. బేసిక్ నిమిత్తం రూ.8.7 కోట్లు విడుదల చేయగా ఇందులో సిసి రోడ్లు, డ్రైన్లు, ఇతర మరమ్మతులు చేపట్టుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 993 మంది గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నారని, వీరికి ఈ ఏడాది ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు రూ.2.22 కోట్లు వేతనం చెల్లించినట్లు చెప్పారు. జిల్లాలో 399 చెత్త సంపద కేంద్రాలు మంజూరయ్యాయని, మరో 31 మంజూరు కావాల్సి ఉందని తెలిపారు. అనంతరం రాజవొమ్మంగి పంచాయితీలో పారిశుధ్య నిర్వహణకు తగినంత సిబ్బంది లేరని, పంచాయతీకి ఒక జెసిబి మంజూరు చేయాలని స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎన్.వివేక్, ఇఒపిఆర్‌డి వి.వెంకట శ్రీనివాసరావు, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి ఆకుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వంచంగి పంచాయతీ రత్నాలపేట గ్రామానికి చెందిన వ్యక్తి నాటు సారా విక్రాయిస్తుండగా అరెస్టు చేసినట్లు జెడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం సిబ్బంది దాడి చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితుడు వద్ద నుండి 7లీటర్లు సారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి, ఆయన్ను అడ్డతీగల కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

నాడు - నేడు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని కొమ్మిక పంచాయతీ, కర్ణికపాలెం గ్రామంలో నాడు-నేడు పథకం కింద మంజూరైన రూ.24 లక్షలతో పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ సెగ్గే సూరిబాబు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కమటం అర్జమ్మ, మాజీ సర్పంచులు కమటం చెల్లారావు, అల్లం నూకరాజు, మాజీ ఎంపీటీసీ దోని బాబి, స్కూల్ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అస్టెంట్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్ కుమార్

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: పని ప్రదేశంలో మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు అనేక చోట్ల వెలుగు చూస్తున్న నేపథ్యంలో సంబంధిత చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మహిళలకు రక్షణగా 2013లో తీసుకొచ్చిన వేధింపుల నిరోధక చట్టంతోపాటు 2012 పోక్సో, గృహహింస నిరోధకచట్టాలు, దిశ చట్ట, ఇతర చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిలతో మేలు

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు : ప్రజారోగ్యం, పర్యావరణ హితంగా ఉన్న పొగరాని పొయ్యిల వినియోగంపై గిరిజనుల్లో అవగాహన కల్పించినట్లు క్రాప్ జోన్ మండల కోఆర్డినేటర్ కంచం అజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కల్యాణమండపం వద్ద స్థానికులకు పొగరాని పొయ్యిల వినియోగం వల్ల కలిగే లాభాలను వివరించారు. వినియోగదారుల శ్రమ కుదింపు, కట్టెల పొయ్యిలతో గిరిజనం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుంటే, ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని, వీటి వినియోగంపై అవగాహన పెంచుకుని వాడాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లాల జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, స్థానిక సర్పంచ్ సీసా సుభాష్‌చంద్ర, ఎంపిడిఓ కె.కిరణ్‌కుమార్, వైస్ ఎంపిపి భోగి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో నినదిస్తున్న నాయకులు

ఒకటి నుంచి 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి డుంబ్రిగూడ: వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డిసెంబర్ ఒకటి నుంచి 45 రోజులపాటు టిడిపి ఆధ్వర్యాన చేపట్టే 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి..' కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని ఎస్‌సి, ఎస్‌టికమిషన్ మాజీ సభ్యుడు ఎస్ అబ్రహం, టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ దోన్ను దొర కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికకమ్యూనిటీ భవనంలో పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన టిడిపి మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, మండలవ్యాప్తంగా 18 పంచాయతీ గ్రామాల్లో నిర్వహించే ఈ నిరసనలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గ మాజీ కోశాధికారి వీ నాగేశ్వరరావు, నాయకులు కె.సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి పాడేరు: కాఫీ రైతులకు మంచి గిట్టుబాటు ధరలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు మండలం వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, ఎఫ్‌పివోలు, లైజన్ వర్కర్లతో కాఫీ ధరలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాఫీ రైతులకు నష్టం కలిగించ కూడదని సూచించారు. ఎఫ్‌పివోలు ధరలు అశాస్త్రీయంగా ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. పోలంబడి కింద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు గ్రామాలలో సమావేశాలు నిర్వహించి కాఫీ ధరలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు,కాఫీ బోర్డ్ డిడి జయంతి ఘోష్, హార్టికల్చర్ డిడి రమేష్ కుమార్‌రావు, కాఫీ ఎడి అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పనుల పురోగతిపై జెడ్‌పి చైర్‌పర్సన్ ఆరా

మండల పరిషత్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సుభద్ర

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పలు కార్యాలయాలను జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాపరిషత్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై ఎంపిడిఓ హర్షిత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు జిల్లా పరిషత్ నిధులను వినియోగించాలని సూచించారు. అధికారులు సక్రమ పర్యవేక్షణతో పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అహో బ్రాండ్ దర్వా కాఫీ రైతుల అభివృద్ధికి, చిట్టెంపాడు జలపాతం, బొర్రా సమగ్రాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి -అనంతగిరి :పీసా, 1/70 వంటి ఏజెన్సీ చట్టాలను అతిక్రమిస్తూ గిరిజనేతరులు చేపట్టే అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలపై అధికారులు దృష్టి సారించారు. భూఆక్రమణలను గుర్తించి, అందులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని కాశీపట్నం పంచాయతీ బంగారంపేట, అరకు ప్రధాన రహదారికి ఆనుకొని సర్వే నెంబర్ 13, 113-2లో ప్రభుత్వ భూమిని, డీఫారం పట్టా భూమిని ఆక్రమించి,, భూమి చుట్టూ కంచె వేసేందుకు అవసరమైన ఇసుప సామగ్రిని అక్కడికి తెచ్చారన్న సమచారంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. సంబంధిత స్థలంలో ముందుగానే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను నిబంధలనకు విరుద్ధంగా ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

హెచ్చరిక బోర్డు పెడుతున్న రెవెన్యూ సిబ్బంది

ఏడుగురు కార్యదర్శులకు డిడిఓ బాధ్యతలు

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రజాపాలన సజావుగా సాగేందుకు వీలుగా మండలంలోని24 పంచాయతీలకు ఏడుగురు సెక్రెటరీలకు డిడిఓ బాధ్యతలు అప్పగిస్తూ మండల పరిషత్ కార్యాలయ వర్గాలు ఉత్తర్వులు జారీచేశాయి. కాశీపట్నం పంచాయతీ డిడిఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వై.రామస్వామికి కివర్ల, పెద్దకోట, ఎగువశోభ పంచాయతీల డిడిఓ బాధ్యతలు అప్పగించారు. జీనబాడు డిడిఓ అనంత ఉమాదేవికి కొండిబ, పిన్నకోట పంచాయతీలు, చిలకలగెడ్డ కార్యదర్శి ఎన్. లావణ్యకు అదనంగా టోకురు, .కోనాపురం పంచాయతీలు, కొత్తూరు సెక్రటరీకి అదనంగా ఎన్ఆర్ పురం, పెద్దబిడ్డ పంచాయతీలు వాలసి సెక్రెటరీ ఎన్.గోపాలకృష్ణకు వేంగడ, పైనంపాడు, గౌసియా బేగంకు బొర్రా, లుంగపర్తి, గరుగుబిల్లి సెక్రటరీకి భీంపోలు, గుమ్మకోట, సెక్రటరీ వై రమణకు రొంపల్లి,. గుమ్మ. అనంతగిరి పంచాయతీ డిడిఓలుగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

తాగునీటి బోర్లుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

విరాళాలతో బోర్ల మరమ్మతులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో పాడైన రెండు తాగునీటి బోర్లును స్థానికులే స్వచ్ఛందంగా చందాలు వేసుకుని మరమ్మతులు చేపట్టారు. హుకుంపేటలోని సోలార్ తాగునీటి పథకంతోపాటు బోర్లు పాడవ్వడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో తలోకొంత విరాళంగా వేసుకుని రెండు బోర్లను బాగుచేసుకున్నారు. మండలకేంద్రంలోనే బోర్ల పరిస్థితి ఇలా ఉంటే, మారుమూల గ్రామాల్లో ఇంకెంత అధ్వానంగా ఉందోననిపలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, హుకుంపేటలోని సోలార్‌నీటి పథకాన్ని బాగుచేయించి, తాగునీటి ఎద్దడి నివారించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బోరు సిబ్బంది రామరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న విద్యా కమిటీ చైర్మన్ టి సూర్యనారాయణ

పిల్లల పెంపకంలో తల్లిదండ్రులది కీలకపాత్ర

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: పిల్లలను చిన్నతనం నుంచే క్రమశిక్షణతో పెంచే బాధ్యతను తల్లిదండ్రులు చేపడితే వారి భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ టిసూర్యనారాయణ అన్నారు. మంగళవారం హెచ్ఎం వి.త్రినాథరావు అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలని, క్రమశిక్షణ, సన్మార్గంలో వారిని తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌విద్యార్థులకు రెండేళ్ళగా కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించకపోవడంతో పిల్లలు ఇంటివద్దనుంచే డబ్బులు తెచ్చుకుని వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కె.గౌరమ్మ, సన్యాసమ్మ, కే సుశీల, జి.గౌరీ, సిహెచ్.రమేష్, సిహెచ్ రామ్మూర్తి పాల్గొన్నారు

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

ప్రజాశక్తి- పెదబయలు : ముంచింగిపుట్టు నోడల్ పాఠశాల, పెదబయలు ఇఎంఆర్ కళాశాల, నోడల్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన వనసమారాధనలో విద్యార్థుల నృత్యాలు పలువురిని కట్టిపడేశాయి. సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థుల జానపద నృత్యరీతులు అతిథులను సమ్మోహనితులను చేశాయి. అనంతరం అతిథులతో సహా విద్యార్థులు, ఉపాధ్యాయులు సహఫంక్తి భోజనాలతో సందడి చేశారు. ప్రిన్సిపల్స్ కేశవరావు, ఈశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విజయవాడ ధర్నాచౌక్ వద్ద బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్ర స్థాయి ధర్నాకు ఉపాధ్యాయులు వెళ్లకుండా ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. ధర్నాకు ప్రభుత్వం అనుమతివ్వడంతో వాహనాల్లో విజయవాడ బయలుదేరుతున్న ఉపాధ్యాయులకు మంగళవారం పోలీసులు ఫోన్లు చేసి స్టేషన్‌కు రావాలని తెలిపారు. విజయవాడ వెళ్లబోమంటూ లెటర్లు ఇవ్వాలని చెప్పడంతో అందుకు నిరాకరించిన యుటిఎఫ్ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులు వెళ్లి బయటకురాకుండా నిర్బంధించారు. యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, కార్యదర్శి కిరణ్, కోశాధికారి అంబేద్కర్‌ను గృహ నిర్బంధం చేశారు. విజయవాడ వెళ్లేందుకు సిద్ధపడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకుల ఇళ్ల వద్ద మంగళవారం సాయంత్రం నుంచి పోలీసులు పహారాకాశారు. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయ్‌కు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ బకాయిలు, సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సిపిఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ తదితర పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 22న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి. ప్రభుత్వం స్పందించకపోవడంతో విజయవాడ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నాకు యుటిఎఫ్ పిలుపునిచ్చింది. ఈ ధర్నాకు బయల్దేరుతున్న ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులను వెళ్లకుండా అడ్డుకొనేందుకు పోలీసులను ప్రభుత్వం రంగంలోకి దించింది. ప్రభుత్వ అణచివేత చర్యలను యుటిఎఫ్ ఖండించింది. 2018 జులై నుంచి నేటి వరకు డిఎలు మంజూరు చేయాలని, రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని ధర్నాకు బయల్దేరిన ఉపాధ్యాయులను అరెస్టు చేయడం అన్యాయమని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చినబ్బాయ్ పేర్కొన్నారు.

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శబరిమల వైపు వెళ్లాలనుకునే అయ్యప్ప భక్తుల అదనపు రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం - కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. 08567 విశాఖపట్నం-కొల్లాం వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబర్ 4 నుంచి జనవరి 15 వరకు ప్రతి ఆదివారం ఉదయం 07.20 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి, తర్వాతి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. 08568 కొల్లాం - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు డిసెంబర్ 5 నుంచి జనవరి 16 వరకు ప్రతి సోమవారం రాత్రి 20.45 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 23.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

అలాగే ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-అరకు-విశాఖపట్నం మధ్య డిసెంబర్ 3 నుంచి జనవరి 22 వరకు ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. 08501 విశాఖపట్నం-అరకు ప్రత్యేక రైలు డిసెంబర్ 3 నుంచి జనవరి 22 వరకు శని, ఆదివారాల్లో ఉదయం 08.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు అరకు చేరుకుంటుంది. 08502 అరకు - విశాఖపట్నం ప్రత్యేక రైలు డిసెంబర్ 3 నుంచి జనవరి 22 వరకు శని, ఆదివారం మధ్యాహ్నం 14.00 గంటలకు అరకులో బయలుదేరి, సాయంత్రం 18.00 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు విశాఖపట్నం - అరకు స్టేషన్ల మధ్య సింహాచలం, కొత్తవలస, బొర్రా గుహలు వద్ద ఆగుతాయి. ప్రజలు ప్రత్యేక రైళ్లను వినియోగించుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి కోరారు

లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నిర్మాణం పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు తక్షణం అందజేయాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు డిమాండ్ చేశారు. పాత నగరం సి హార్స్ జంక్షన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల సముదాయాన్ని మంగళవారం సాయంత్రం సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయిందని, కొద్దిపాటి మౌలిక సదుపాయాలు మాత్రమే కల్పించాల్సి ఉందని అన్నారు. లబ్ధిదారులకు వీటిని అందజేయడంలో ఇప్పటికే జాప్యం జరిగిందన్నారు. అందువల్ల నిర్మించిన గృహాలు పాడయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, జి.రాంబాబు, పాత్రపల్లి చంద్రశేఖర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉల్లం నాగరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎరిపల్లి రాంబాబు పాల్గొన్నారు.

మంజూరు పోస్టుల్లో పాత వర్కర్లను నియమించాలి

ఐటిడిఎ పిఓకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - చింతూరు : విఆర్.పురం మండలంలోని కళాశాల వసతి గృహాలకు మంజూరైన పోస్టుల్లో ఇప్పటికే అనేక సంవత్సరాలుగా ఆ పనులు చేస్తున్న వర్కర్లను నియమించాలని ఐటిడిఎ పిఓ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు సిఐటియు ఆధ్వర్యాన బాధిత కార్మికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ 2007లో కళాశాల వసతి గృహాలను ప్రభుత్వం ప్రారంభించిందని, నాడు వంట చేయడానికి, వాచ్‌మెన్‌గా చింతూరు బాలిక హాస్టల్‌లో ముగ్గురు, చింతూరు బాలురు హాస్టల్‌లో ముగ్గురు వర్కర్లు జాయిన్ అయ్యారని తెలిపారు. విఆర్.పురం, కూనవరం మండలాల్లోనూ ఈ విధంగానే వర్కర్లు జాయిన్ అయ్యారని వెల్లడించారు. నాటి నుండి మంజూరు పోస్టులు లేకపోవడంతో అతి తక్కువ వేతనాలు వీరు పని చేశారని తెలిపారు. పోస్టులు మంజూరు కోసం అనేక దాఫలుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేసిన ఫలితంగా ఒక్కొక్క హాస్టల్‌కు 5 పోస్టులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఎప్పటి నుంచి ఇక్కడ పని చేస్తున్న వారిని ఆ పోస్టుల్లో నియమించకుండా ఆశ్రమ పాఠశాలల నుండి తీసుకొచ్చి పెట్టడం దుర్మార్గమన్నారు. వార్డెన్లు, అధికారులు కక్ష పూరితంగా ఎప్పటి నుండో పనిచేస్తున్న వర్కర్లను ఇంటికి పంపాలానే కుట్రతో ఇలా చేస్తున్నారని తెలిపారు. దీనికి పిఓ స్పందిస్తూ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్లు సుబ్బమ్మ, రామ్మూర్తి, వెంకమ్మ, లక్ష్మి, కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వెంకట్, తదితరులు

టూరిజం నిర్వహణ స్థానిక ఆదివాసీలకు ఇవ్వాలి

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్



మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలోని టూరిజం నిర్వహణ మొత్తం స్థానిక ఆదివాసీలకు ఇవ్వాలని గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి అధ్యక్షతన రంపచోడవరంలో జరిగిన గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో పీసా, 1/70 చట్టాలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి, గ్రామ సభలు నిర్వహించకుండా ఇష్టానుసారంగా టూరిజం కేంద్రాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆదివాసీ చట్టాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే టూరిజం నిర్వహణ ఏజెన్సీలో స్థానిక ఆదివాసీలు నిర్వహించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా వచ్చిన ఆదాయం ఆయా గిరిజన గ్రామాల అభివృద్ధికి, సంక్షేమానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎకో టూరిజం ద్వారా వచ్చిన లక్షల రూపాయలు గిరిజనులకు చెందటం లేదని, గిరిజనేతరులతో ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై లాభపడుతున్నారని తెలిపారు. అందుచేతనే టూరిజం ద్వారా వచ్చిన ఆదాయం గ్రామాల అభివృద్ధికి కేటాయించాలన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు తీగల శ్రీనువాస్ కొండ్ల సూరిబాబు, ఆవుల ధర్మారెడ్డి, కుంజం జగన్నాథం, కె.సురేష్, కాకా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ సెక్టరు అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న చంద్రావతి రిటైర్మెంట్ సందర్భంగా వీడ్కోలు సభను స్థానిక ఎలిమెంటరీ స్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సోమేల అప్పలనర్స మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తగా చంద్రావతి సుమారు 20 ఏళ్ల విధులు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు బుజ్జిబాబు, అంగన్వాడి సూపర్వైజర్ మోహిని, ఆశ యూనియన్ ప్రెసిడెంట్ ఎన్ విజయకుమారి, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చంద్రావతికి వీడ్కోలు పలుకుతున్న అంగన్‌వాడీలు, ఆశాలు

దీక్షలు చేస్తున్న సత్య సాయిబాబా వాటర్ సప్లయ్ వర్కర్లు

6వ రోజుకు నీటి సరఫరా కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : సత్య సాయిబాబా వాటర్ సప్లై వర్కర్లకు రావాల్సిన పది నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 6వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు త్రిత్వ దాసు, కిశోర్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులకు తాగునీరు అందించే కార్మికులకు పది నెలలుగా వేతన బకాయిలు పెట్టటం, రెండేళ్లగా ఈఎస్ఐ, పిఎఫ్ కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల కాంట్రాక్టరు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. దీనిపై ఐటిడిఎ పిఓ, జిల్లా కలెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం కాకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓటర్ల నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఓటర్ల నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించే నిమిత్తం రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో రంపచోడవరం అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, లేనోర ఇంజనీరింగ్ కాలేజ్ విద్యారులు, ఉపాధ్యాయులు మనవహారం నిర్వహించారు. దీనికి ముందు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన కొంతమందికి ఓటు నమోదు కొరకు ఫారం -6 అందజేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.వెంకటేశ్వరరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎన్‌వివి.సత్యనారాయణ, ఎన్నికల సీనియర్ సహాయకులు డి.ఇదిరాభాయి పాల్గొన్నారు.

పంచకర్లకు స్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి విశాఖ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన పంచకర్ల రమేష్‌బాబుకు పార్టీ నగర కార్యాలయంలో అపూర్వ స్వాగతం లభించింది. ఆయనకు ఘన స్వాగతం పలికిన వారిలో వైసిపి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఉన్నారు.